వరద కాలువ ఖాళీ..



ఎండుతున్న పొలం



నీరు లేని వరద కాలువ

- సాగునీటికి రైతుల తంటాలు
- ఎండుతున్న పొలాలు
- నీటి విడుదల కోసం ధర్నాలు

గంగాధర: వరద కాలువను నమ్ముకొని యాసంగిలో వరి పంటను సాగు చేసిన రైతులు సాగునీటికి తంటాలు పడుతున్నారు. యాసంగి ఆరంభంలో వరద కాలువలో పుష్కలంగా నీరు ఉండటంతో పాటు మధ్యలో మిడ్‌మానేర్‌కు నీటి విడుదల చేయడం, వానలు కురిస్తే పంటలు పండుతాయనే ఆశతో రైతులు వేలాది ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. వారం, పది రోజుల క్రితం వరకు అడుగంటిన నీటిని వాడుకుంటూ పంటను దక్కించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం వరద కాలువలో నీరు ఖాళీ కావడంతో సాగునీటి సమస్య ఏర్పడింది.

తప్పని తిప్పలు

వరద కాలువలో చుక్క నీరు లేక సాగునీటి కోసం రైతులు తిప్పలు పడుతున్నారు. కాలువలో గుంతలు తవ్వీస్తూ ఊరుతున్న కొద్దిపాటి నీటిని వాడుకుంటూ ఎండిపోతున్న పంట పొలాలను కాపాడుకోవడానికి తంటాలు పడుతున్నారు. ప్రస్తుతం పొలాలన్నీ పొట్ట దశతోపాటు గొలక బయటకు వచ్చి ఉందని, ఇప్పుడు నీరు లేకుంటే వరి దక్కదని రైతులు వాపోతున్నారు. ఒక్కసారి వరద కాలువకు నీరు వదిలితే పంటలు చేతికొస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మూడు వేల ఎకరాల్లో..

వరద కాలువ ఆధారంగా కొండన్నపల్లి, కురిక్యాల, తాడిజర్రి, రంగరావుపల్లి, ఆచంపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు మూడు వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. రెండు వేల ఎకరాలు వరద కాలువ నీటిని వినియోగిస్తూ సాగు చేయగా, మరో వేయి ఎకరాల వరకు వరద కాలువలో నీరుంటే భూగర్భ జలాలు పెరిగి బావుల్లోని నీటి వినియోగం ద్వారా సాగు చేశారు. వరద కాలువలో నీరు లేక బావుల్లో నీరు తగ్గి సాగు చేసిన పొలాలు పారడం లేదని రైతులు పేర్కొంటున్నారు.

ఆందోళనలు..

వరద కాలువకు నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంట పొలాలను కాపాడాలని రైతులు, వారికి మద్దతుగా బీజేపీ నాయకులు రాస్తారోకోలు చేసినా పాలకుల్లో స్పందన లేదు. నీటి విడుదల కోసం మార్చి 24న రైతులు రాస్తారోకో చేయడానికి కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిలో కురిక్యాల శివారులో గల వరద కాలువ వంతెన పైకి రాగా.. విషయం తెలుసుకున్న పోలీసులు ఎమ్మెల్యేతో మాట్లాడించారు. అదేరోజు రాత్రి నీటిని విడుదల చేయిస్తానన్న ఎమ్మెల్యే నాగిరెడ్డిపూర్ శివారులోని వరద కాలువపై గేట్లు కొద్దిగా తీయించగా వచ్చిన నీరు కిలోమీటరు వరకైనా రాలేదు. దీంతో రైతులు మార్చి 26న నీటిని విడుదల చేయాలని రాస్తారోకో చేశారు. అయినా స్పందన కరువైంది. నీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని బీజేపీ నాయకులు 29న వరద కాలువపై రైతులతో కలిసి రాస్తారోకో చేశారు. అయినా పట్టించుకునేవారే కరువయ్యారని రైతులు వాపోతున్నారు.

సాగునీరు కొంటున్న



నా బావి, వ్యవసాయ భూమి మొత్తం వరద కాలువ, అదనపు టీఎంసీ కాలువల కిందే పోయింది. పక్కనే మూడు ఎకరాలు కొనుగోలు చేసి వరద కాలువ నీటితో వరి పంటను సాగు చేసిన. కాలువలో నీరు ఖాళీ కావడంతో పొట్ట దశలోని పొలాన్ని కాపాడుకోవడానికి రూ.పది వేలు పెట్టి నీరు కొని పారిస్తున్నా. నీరు విడుదల చేస్తే బాగుండేది.

– వరాల సుధాకర్, రైతు, తాడిజర్రి

పదెకరాల్లో సాగు



వరద కాలువ నీటి ఆధారంగా వందలాది మంది రైతులు వేలాది ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం పొలాలన్నీ గొలక దశలో ఉన్నాయి. మరో పది రోజుల పాటు నీరుంటేనే పొలాలు దక్కుతాయి. పది ఎకరాల్లో వరి పంటను సాగు చేసిన. వరద కాలువ నీరు రాకుంటే సగం వరకు ఎండిపోతది. ఇప్పటికైనా పాలకులు వరద కాలువకు నీటిని విడుదల చేయాలి.

– రవి, రైతు, కొండన్నపల్లి

కడియం శ్రీహరి, కేకే చరిత్రహీనులు



మాట్లాడుతున్న సుంకె రవిశంకర్

కరీంనగర్: పదేళ్లు బీఆర్‌ఎస్‌లో అనేక పదవులు అనుభవించి ఇప్పుడు పార్టీ మారిన కడియం శ్రీహరి, కె.కేశవరావు చరిత్రహీనులని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అవకాశవాదులు పార్టీని వీడినంత మాత్రాన జరిగే నష్టమేమీ లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కేకేను ఆయన కుటుంబాన్ని అవమానిస్తే కేసీఆర్ చేరదీసి అందలమెక్కించారని తెలిపారు. కడియం, కేశవరావుకు కేసీఆర్ పునర్జన్మ ఇచ్చాడని అన్నారు. పాలనపై దృష్టి పెట్టాల్సిన సీఎం రేవంత్ రెడ్డి గేట్లు తెరిచామంటూ ఇతర పార్టీ నేతలను తమ పార్టీలకు చేర్చుకుంటున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, యువత అధ్యక్షుడు దీకొండ కుల్దీప్ వర్మ, మైనార్టీ ప్రెసిడెంట్ షౌకత్ అలీ, మాజీ గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్, నాయకులు ఆరె రవి, పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, ఓడ్నాల రాజు, బొంకూరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

శంకరపట్నం: మండలంలోని పలు గ్రామాల పంచాయతీ కార్యాలయాల ఎదుట జీపీ కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల పంచాయతీలో సెక్రటరీ వేధింపులు భరించలేక కార్మికుడు ప్రసాద్ పురుగుల మందు తాగాడని ఆరోపిస్తూ ఆందోళన చేశారు. జీపీ కార్మికులపై అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని సీఐటీయూ మండల నాయకుడు సారయ్య ఆరోపించారు. కార్మికుడికి ప్రభుత్వం ప్రత్యేక వైద్యం అందించాలని, కార్యదర్శిని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఇంటికి తాగునీరు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

శంకరపట్నం: మండలంలోని గ్రామాల్లో ప్రతి ఇంటికి తాగునీటిని సరఫరా చేయాలని మండల ప్రత్యేక అధికారి దేవేందర్‌రావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం తాగునీటిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవి కాలంలో నీటి సమస్య వచ్చే అవకాశం ఉందన్నారు. నీటి సరఫరా విషయంలో ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. తహసీల్దార్ అనుపమ, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు, గ్రామ సెక్రటరీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్‌ను కలిసిన నాయకులు



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

జమ్మికుంట: రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా డాక్టర్ మహమ్మద్ రియాజ్ నూతనంగా నియామకమైన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర నూర్ భాషా సంఘం ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అంకూస్ శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూర్ భాషా(దూదేకుల) కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోవాలని కోరారు. సానుకూలంగా స్పందించారని తెలిపారు. మహమ్మద్ అమన్, రియాజ్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధితోనే మహిళా సాధికారత

జమ్మికుంట: ఆర్థిక అభివృద్ధితో మహిళా సాధికారత సాధ్యమని బాల వికాస ప్రోగ్రాం ఆఫీసర్ లత అన్నారు. పట్టణంలో బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 15 మంది మహిళలకు 21 రోజులు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశానికి శనివారం హాజరై మాట్లాడారు. బాల వికాస సంస్థ ఉత్సాహవంతమైన మహిళలు ముందుకొస్తే ఆయా రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని అన్నారు. శిక్షణ సర్టిఫికెట్లను అందజేశారు. బాల వికాస కేంద్ర మేనేజర్ పబ్బు సులోచన, కోఆర్డినేటర్లు సుమలత, శిరీష, శిక్షకురాలు లావణ్య, మహిళలు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

జమ్మికుంట: పేకాట ఆడుతున్న 9 మందిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరగంటి రవి శనివారం తెలిపారు. శంభునిపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్ సీఐ రవీందర్ టీం, టౌన్ సీఐ వరగంటి రవి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 9 మంది పేకాట రాయుళ్లను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.50,700 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఎన్నికలకు సహకరించాలి



మాట్లాడుతున్న సీఐ వెంకన్న

శంకరపట్నం: ప్రజలు ఎన్నికల్లో ప్రశాంతంగా పాల్గొని ఓటేయాలని సీఐ వెంకన్న సూచించారు. కొత్తగట్టు గ్రామ పంచాయతీలో శనివారం పార్లమెంట్ ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఎన్నికల సందర్భంగా గొడవలకు దిగేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మారెడ్డి, రాజిరెడ్డి, మురళి, రాజయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు అకౌంట్లు స్తంభింపజేయడం సరికాదు

రామడుగు: కాంగ్రెస్ పార్టీ బ్యాంకు అకౌంట్లు స్తంభింపజేయడం సరికాదని, ఈ చర్య ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమేనని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్టుమెంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్న రాజమల్లయ్య ఒక ప్రకటనలో ఖండించారు. రూ.1,800 కోట్లు జరిమానా చెల్లించాలని ఐటీ శాఖ నోటీసులు జారీ చేయడం మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని హత్య చేసినట్లయిందని ఆరోపించారు.

స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సై ఉద్యోగ విరమణ



మెమొంటో అందిస్తున్న సీపీ

శంకరపట్నం: స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సై నూరొద్దీన్ శనివారం ఉద్యోగ విరమణ పొందారు. కరీంనగర్ కమిషనరేట్‌లో సీపీ అభిషేక్ మహంతి శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. 41 ఏళ్లపాటు వివిధ హోదాల్లో పని చేశారని కొనియాడారు. కేశవపట్నం ఎస్సై లక్ష్మారెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

కరీంనగర్‌క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో కరీంనగర్ కోర్టు ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన తొమ్మిది మందిని ట్రాఫిక్ పోలీసులు శనివారం కోర్టులో హాజరుపర్చగా.. ఒక వ్యక్తికి పది రోజుల జైలు, మరో వ్యక్తికి ఏడు రోజుల జైలుశిక్షతోపాటు రూ.4,000 జరిమానా, మిగతావారికి రూ.10,500 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు సీఐ తెలిపారు.



నల్లగొండ నర్సింహస్వామి ఆదాయం రూ.16.57లక్షలు

ఆధ్యాత్మికం

తిమ్మాపూర్: నల్లగొండ శ్రీసీతారామ లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియడంతో ఆలయ చైర్మన్ బండారిపల్లి లక్ష్మణ్, ఈవో ఉడుతల వెంకన్న సమక్షంలో శనివారం హుండీలు లెక్కించారు. వారం రోజుల్లో టెండర్లు, ఆభరణాలు, హుండీల ద్వారా స్వామివారికి రూ.16,57,284 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని చైర్మన్ లక్ష్మణ్, ఈవో వెంకన్న తెలిపారు. ఆలయం అభివద్ధి దశలో ఉన్నందున దాతలు ఎవరైనా ఉంటే సహాయం చేయాలని కోరారు.

విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న సీడ్ ప్రతినిధులు

వీణవంక: గంగారం గ్రామంలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి శ్రీరామ బయోసీడ్ క్రాప్ మేనేజర్ గోపీకృష్ణ ఆధ్వర్యంలో సీడ్ ఆర్గనైజర్ ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి రూ.3లక్షల విరాళాన్ని ఆలయ కమిటీకి శనివారం అందజేశారు. శ్రీరామచంద్రస్వామి ఆలయానికి సహాయ సహకారాలుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ, మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, రైతులు, యువకులు, గ్రామస్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శివకేశవాలయంలో పూజలు

చొప్పదండి: పట్టణంలోని శివకేశవాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ గెలువాలని పూజలు చేసిన అనంతరం పట్టణంలోని వ్యాపార సముదాయాల్లో ప్రచారం నిర్వహించారు. ఏనుగు రవీందర్‌రెడ్డి, ఇప్పనపల్లి విజయలక్ష్మి, సాంబయ్య, ఆరెళ్లి చంద్రశేఖర్‌గౌడ్, కొత్త గంగరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

జమ్మికుంట: మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ సమక్షంలో జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నకోటి, వారి వర్గీయులు శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీలో చేశారు. మంత్రి పొన్నం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పని చేస్తామని అన్నారు. దొంత రమేశ్, అరుకాల వీరేశలింగం, కౌన్సిలర్లు బొంగోని వీరన్న, పొనగంటి సారంగం, దేశిని రాధాసదానందం, ఎలగందుల స్వరూపశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



జమ్మికుంట: పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి పొన్నం



ఇల్లందకుంట: మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

ఇల్లందకుంట: భోగంపాడు గ్రామ మాజీ సర్పంచ్ జిల్లెల్ల తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కల్లెం సత్యనారాయణరెడ్డి, శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నాయకుడు ఓదెలు బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. శనివారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి



కరీంనగర్‌టౌన్: సీతారాంపూర్‌లోని సర్వే నం.16లో గల 2.30 ఎకరాల ప్రభుత్వ భూమిని భూకబ్జాదారుల నుంచి కాపాడాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్ శనివారం అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు రియల్ ఎస్టేట్ వ్యాపారం అవతారం ఎత్తి సీతారాంపూర్ గ్రామపంచాయతీగా ఉన్నప్పటి నుంచి నగర పాలక సంస్థలో విలీనం జరిగే వరకు ఈ ప్రాంతంలో అక్రమంగా కబ్జా చేశారని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించి భూకబ్జాదారులపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, యుగేందర్ తదితరులు ఉన్నారు.

చిత్ర కథ



చెత్తపై నిర్లక్ష్యం

నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్ మధ్యలో ఉన్న అన్నపూర్ణ కాంప్లెక్స్ పార్కింగ్ స్థలంలో వేసిన వ్యర్థాల చెత్త తొలగించకపోవడంతో ఆ ప్రాంతమంతా కంపు కొడుతోంది. అదే కంపులో వర్తకులు కూరగాయలు విక్రయిస్తున్నారు. అధికారులు పట్టించుకొని ఏరోజు చెత్త అదే రోజు తొలగించాలని వ్యాపారులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

క్రమశిక్షణతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు



మాట్లాడుతున్న రంగప్రసాద్

కరీంనగర్‌సిటీ: క్రమశిక్షణ, సత్ప్రవర్తనతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అని శాతవాహన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ ఎస్.వి.రంగప్రసాద్ అన్నారు. నగరంలోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో విఫెస్ట్ 2కే24 పేరుతో శనివారం నిర్వహించిన వాణినికేతన్ డిగ్రీ, పీజీ కళాశాల వార్షికోత్సవ వేడుకలను ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను చదివిన కళాశాలకే అతిథిగా రావడం ఆనందంగా ఉందన్నారు. ఇంతటి ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కారణం ఈ కాలేజీలో చదవడమేనని తెలిపారు. కెరీర్‌లో సక్సెస్ కావాలంటే క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో వాణినికేతన్ విద్యాసమితి చైర్మన్ సీహెచ్.విజయ, ఎంబీఏ డైరెక్టర్ వెంకట్ రావు, వాణినికేతన్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ప్రశాంత్ రావు, వాణినికేతన్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డి.వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గంజాయి పట్టివేత

హుజూరాబాద్: పట్టణంలోని ఆర్టీసీ డిపో క్రాస్ వద్ద గంజాయిని తరలిస్తున్న 16 సంవత్సరాలున్న వ్యక్తిని పట్టుకున్నట్లు శనివారం టౌన్ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు. డిపో క్రాస్ వద్ద పోలీసుల తనిఖీల్లో భాగంగా గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. బంధువుల సమక్షంలో విచారించి పంచనామా చేసి అతడి దగ్గరి నుంచి కిలో72గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ దగ్గర బంధువుల సమక్షంలో అప్పగించినట్లు తెలిపారు. గంజాయిని విక్రయించిన, సేవించిన వారిపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

రూ.1.08లక్షలు..

కరీంనగర్‌క్రైం: శాతవాహన యూనివర్సిటీ సమీపంలో శనివారం రాత్రి పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో ఒక కారులో రూ.1.08 లక్షలు పట్టుబడినట్లు టూటౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. గ్రానైట్ ఫ్యాక్టరీ యజమాని అసురాంకు చెందిన ఆ నగదును సీజ్ చేశామన్నారు. వివరాలు సరిగా లేనందున బ్యాంకులో డిపాజిట్ చేస్తామని తెలిపారు.

దేశీ కార్యక్రమంలో పాల్గొన్న డీలర్లు



మామిడి తోటలో అంతర పంటలను పరిశీలిస్తున్న డీలర్లు

రామడుగు: గోపాల్‌రావుపేట పట్టు(మల్బరీ) రైతు ఎడవెల్లి కిషన్‌రెడ్డి మల్బరీ తోటను కరీంనగర్ క్రిమిసంహారక మందుల డీలర్లు దాదాపు 40 మంది దేశీ కార్యక్రమంలో భాగంగా పరిశీలించారు,. మల్బరీలో వస్తున్న ఇబ్బందులు, వాటి పరిష్కారం వివరాలను కిషన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రామడుగులో రైతు బొమ్మరవేని తిరుపతి మామిడి తోటలో అంతర పంటలు పలు కూరగాయలు, మిర్చి, దోస, టమాటా, బీర, వంకాయల సాగు పరిశీలించారు. దేశీ కార్యక్రమం పెసిలేటర్ కొంరయ్య, రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి మమత పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలి

విద్యానగర్(కరీంనగర్): మాదిగలకు జనాభా ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంటు సీట్లు కేటాయించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొట్టపింజర రమేశ్ అన్నారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో నిర్వహించిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ మోసం చేసిందని, ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో సమితి జిల్లా అధ్యక్షుడు కొలిపాక సారంగం, నాయకులు ఎ.వెంకట్, శనిగరపు మధు, జి.వెంకన్న, నగేశ్, లక్ష్మణ్, రవికుమార్, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ పరిచయ వేదిక

సప్తగిరికాలనీ(కరీంనగర్),: నగరంలోని పద్మనగర్‌లో గల భట్రాజు భవనంలో శనివారం జిల్లా భట్రాజ్ సంఘం ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 200 మంది హాజరయ్యారు. జిల్లా నాయకులు చెన్నమాధవుని పవనసుతరాజు, సంఘం నాయకులు ఎర్రమరాజు బాపు, విజయ రఘురామ, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.